# నమస్తే తెలంగాణ
## భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, బుధవారం 28 ఆగస్టు 2024 | BHADRADRI KOTHAGUDEM


## ఐటీడీఏ పీవో రాహుల్
# గిరిజన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

బూర్గంపహాడ్(భద్రాచలం), ఆగస్టు 27 : గిరిజన మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, కుటుంబ పోషణలో తమదైన పాత్ర పోషించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. భద్రాచలంలో ఎంఎస్ఎం యూనిట్ ద్వారా సబ్బులు, షాంపూలు తయారు చేసే కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. దమ్మక్క జాయింట్ లయబిలిటీ గ్రూప్ ఆదివాసీ గిరిజన మహిళలతో మాట్లాడారు. గిరిజన మహిళలు తాము తయారు చేసిన షాంపూలు, సబ్బులను బయట మార్కెటింగ్ చేయడమే కాకుండా ఆశ్రమ, గురుకుల పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా చేసేలా చూడాలన్నారు. మార్కెటింగ్ విషయంలో మధ్యవర్తులను నమ్మొద్దని, అనుభవజ్ఞులైన మహిళలు సొంతంగా మార్కెటింగ్ చేయడానికి వెసులుబాటు కల్పించుకోవాలన్నారు. అనంతరం లక్ష్మీగణపతి మహిళా ట్రైబల్ జాయింట్ లయబిలిటీ గ్రూప్ న్యూట్రిమిక్స్ డ్రైమిక్స్ తయారీ కేంద్రాన్ని సందర్శించి పీవో.. తయారీ విధానం అడిగి తెలుసుకున్నారు. వీటిని చిన్నారులు, బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు సరఫరా చేసుకునే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎస్‌వో ఏడీ అగ్రికల్చర్ భాస్కర్, జీసీసీ డీఎం దావీద్, ఉద్యాన అధికారి ఉదయ్‌కుమార్, డీఎస్‌వో ప్రభాకర్‌రావు, రామ్‌కుమార్, బేబిరాణి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సబ్బుల తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

# మంత్రి తుమ్మల ఘెరావ్

- చుట్టుముట్టిన అన్నదాతలు.. కారు దిగొచ్చిన అమాత్యుడు
- షరతుల్లేకుండా రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్
- ఖమ్మం కలెక్టరేట్ ఎదుట రైతుసంఘాల ఆధ్వర్యంలో ధర్నా
- జాతీయ రహదారిపై భారీ ప్రదర్శన
- అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం.. : మంత్రి తుమ్మల



జాతీయ రహదారిపై భారీ ప్రదర్శన చేస్తున్న సీపీఎం, సీపీఐ, రైతు సంఘాల నేతలు, రైతులు

ఖమ్మం, ఆగస్టు 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, చేనేతశాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు రైతుల సెగ గట్టిగానే తగిలింది. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ చెప్పినట్లుగా షరతులు లేకుండా రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ చుట్టుముట్టారు. మంగళవారం ఖమ్మం కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం, రైతుసంఘాల ఆధ్వర్యంలో అన్నదాతలు ధర్నా చేశారు. ముందుగా కలెక్టరేట్ పక్కనే ఉన్న వీ.వెంకటాయపాలెం గ్రామం నుంచి కలెక్టరేట్ వరకు జాతీయ రహదారిపై భారీ ప్రదర్శన చేశారు. ధర్నా సమయంలో కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం ముగించుకొని బయటకు వస్తున్న మంత్రి తుమ్మల కారును ప్రధాన గేటు వద్ద రైతులు అడ్డగించారు. రుణమాఫీ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ అనుసరిస్తున్న తీరును నిరసిస్తూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఐ, సీపీఎం నాయకులు, రైతుసంఘాల నేతలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతుల రుణమాఫీ విషయంలో చేస్తున్న జాప్యం వారికి శాపంగా మారిందన్నారు. రోజుకో కొర్రీ పెడుతూ రుణమాఫీ చేయకుండా దాటవేసే ధోరణి ప్రదర్శిస్తున్నదని ఆరోపించారు. రాష్ట్రంలో కేవలం 50శాతం మంది రైతులకు మాత్రమే రుణమాఫీ జరిగిందని, ప్రభుత్వ లెక్కలు అసంబద్ధంగా ఉన్నాయన్నారు. జిల్లాలో 30శాతం మందికి కూడా రుణమాఫీ జరగలేదని పేర్కొన్నారు. అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు చెబుతున్న లెక్కలకు, అధికారిక లెక్కలకు పొంతన లేదని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎప్పటివరకు రుణమాఫీ పూర్తిస్థాయిలో చేస్తారో సరైన తేదీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో లక్షలోపు రుణాలు మాఫీ చేసిన ఖాతాల సమస్య కూడా ఇంకా పూర్తి కాలేదన్నారు. రేషన్‌కార్డు లేనివారికి, పహాణీలతో రుణాలు తెచ్చుకున్న వారికి ఈ పథకం వర్తింప చేయకపోవడం న్యాయంకాదన్నారు. రేషన్‌కార్డు నిబంధన, రెండు లక్షలకు పైగా అప్పులు ఉన్న రైతులు వెంటనే ఆ పై మొత్తాన్ని ముందుగా చెల్లిస్తేనే రుణమాఫీ చేస్తామనడం రైతుల పాలిట శాపంగా మారిందన్నారు. ఎలాంటి షరతులు, నిబంధనలు లేకుండా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించినట్లుగా అర్హత ఉన్న ప్రతి రైతు ఖాతాలో రుణమాఫీ జమ కావాలని డిమాండ్ చేశారు. ఆగస్టు 30వ తేదీలోపు 2లక్షల రుణమాఫీ జరగాలని లేదంటే రైతులతో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో రుణమాఫీ ప్రక్రియను జాప్యం చేయకుండా సత్వరమే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. 2లక్షల పైన ఉన్న రైతుల రుణమాఫీ విషయంలో మంత్రివర్గం వెంటనే నిర్ణయం తీసుకోవాలని సూచించారు. రైతుభరోసా డబ్బులను కూడా ఈ వానకాలం పంటలకు వెంటనే జమ చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కాంగ్రెస్ పతనం తప్పదని హెచ్చరించారు.

### అర్హులందరికీ రుణమాఫీ చేస్తాం.. : మంత్రి తుమ్మల

అర్హులందరికీ రైతు రుణమాఫీ చేస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వామపక్ష పార్టీ, రైతు సంఘాల నేతలు రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట మంత్రిని చుట్టుముట్టడంతో కారు దిగిన మంత్రి తుమ్మల వారితో మాట్లాడారు. రాష్ట్రంలో 41,78,892 మంది రైతులు 40 బ్యాంకుల ద్వారా 5,782 బ్రాంచిల నుంచి రుణాలు తీసుకున్నారని తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం రూ.31 వేల కోట్ల నిధులను కేటాయించిందన్నారు. 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు రైతులు తీసుకున్న రుణాలను మాఫీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, ఆ ప్రక్రియ అమలు అవుతుందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు రూ.12 వేల కోట్లు రైతుల ఖాతాల నుంచి తిరిగి రుణాలుగా పొందారని, మిగిలిన ప్రక్రియను కూడా పూర్తి చేస్తామన్నారు. కుటుంబ నిర్ధారణ జరగకనే రుణమాఫీ అమలు ఆలస్యమవుతున్నది తప్ప ప్రభుత్వపరంగా ఎలాంటి జాప్యం లేదన్నారు. మంగళవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా వ్యవసాయ అధికారులు ఇంటింటికీ తిరిగి వివరాలు సేకరించి అక్కడే కుటుంబసభ్యుల ఫొటోలను ప్రత్యేకయాప్‌లో అప్‌లోడ్ చేస్తారని తద్వారా రుణమాఫీ మొత్తం రైతు ఖాతాలో జమ అవుతుందన్నారు. రేషన్‌కార్డులు, పాస్ పుస్తకాలు లేకపోయినా రుణమాఫీ అమలు అవుతుందన్నారు. రెండు లక్షలకు పైన ఉన్న రైతులు పైన ఉన్న మొత్తాన్ని చెల్లిస్తేనే ప్రభుత్వం తరఫున రెండు లక్షలు జమ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వం దీనికి సంబంధించిన వివరాలు త్వరలో విడుదల చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతుల కుటుంబాలను రుణ విముక్తులను చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతులు ఎటువంటి అనుమానాలకు గురికావద్దన్నారు. ధర్నాలో రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, రైతు సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొండపాటి రమేశ్, కొండపర్తి గోవిందరావు, తెలంగాణ రైతు సంఘం అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు బొంతు రాంబాబు, సీపీఐ, సీపీఎం పార్టీల నాయకులు జమ్ముల జితేందర్‌రెడ్డి, ఎస్కే జానీమియా, పోటు కళావతి, బండి రమేశ్, పొన్నం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. ధర్నా అనంతరం రైతుల డిమాండ్లు, సమస్యల పరిష్కారం కోరుతూ రెండు పార్టీలు నేతలు, రైతు సంఘాల నేతలు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను కలిసి వినతిపత్రం అందించారు.



ఖమ్మం కలెక్టరేట్ వద్ద సీపీఎం, సీపీఐ, రైతు సంఘాల నేతలు, రైతులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

### మంత్రి తుమ్మల తీవ్ర అసహనం
#### రైతుపై చేయి చేసుకునేందుకు యత్నం

రుణమాఫీ అమలు చేయాలని ధర్నా చేస్తున్న రైతులపై మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నినాదాలు చేస్తున్న ఓ రైతుపై చేయి చేసుకునే ప్రయత్నం చేశారు. రుణమాఫీపై రైతులు మాట్లాడుతుండగా ఒక దశలో సహనం కోల్పోయిన మంత్రి ఓ రైతుపై చేయి చేసుకునే యత్నం చేశారు. రైతులను రెచ్చగొట్టడం ఎవరికీ తగదని హెచ్చరించారు. రుణమాఫీపై స్పష్టత ఇవ్వాలని రైతులు పట్టుబట్టారు. దీంతో మంత్రి తుమ్మల మాట్లాడుతూ అర్హులైన రైతులందరికి రుణమాఫీ వస్తుందని హామీ ఇచ్చారు.

# బీఆర్ఎస్ శ్రేణుల సంబురాలు

- ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరుపై హర్షం
- ఉమ్మడి జిల్లాలో పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ
- ఎవరెన్ని కుట్రలు పన్నినా న్యాయమే గెలిచింది : సండ్ర



ఖమ్మం బీఆర్ఎస్ కార్యాలయంలో పటాకులు కాల్చి సంబురాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఖమ్మం, ఆగస్టు 27 : సుప్రీం కోర్టు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితకు బెయిల్ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం ఉమ్మడి ఖమ్మం జిల్లావ్యాప్తంగా బీఆర్ఎస్ శ్రేణులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేసి వేడుకలు నిర్వహించారు. ఖమ్మం నగరంలోని బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఆదేశాల మేరకు సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, పార్టీ సీనియర్ నాయకుడు ఆర్జేసీ కృష్ణ ఆధ్వర్యంలో పటాకులు కాల్చి, స్వీట్లు పంచి పెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎవరు ఎన్ని కుట్రలు పన్నినా న్యాయమే గెలిచిందని, సుప్రీం కోర్టు సరైన తీర్పు ఇచ్చిందన్నారు. అనంతరం 'జై బీఆర్ఎస్.. జై కేసీఆర్' అంటూ నాయకులు, కార్యకర్తలు నినాదాలు చేశారు. కార్యక్రమంలో మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు తాజుద్దీన్, బీఆర్ఎస్ ఖమ్మం రూరల్ పార్టీ అధ్యక్షుడు బెల్లం వేణు, తిరుమలాయపాలెం మండల పార్టీ అధ్యక్షుడు భాషబోయిన వీరన్న, బీఆర్ఎస్ యువజన విభాగం నగర ప్రధాన కార్యదర్శి మాటేటి కిరణ్, ఉద్యమకారులు పగడాల నరేందర్, లింగనబోయిన సతీశ్, ఆసిఫ్, టెంకటి సందీప్, సద్దాం, సతీశ్, మంచానాయక్ పాల్గొన్నారు.

## కవితకు బెయిల్ మంజూరుపై హర్షం

### బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్

ఖమ్మం, ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కవితకు సుప్రీం కోర్టు బెయిల్ ఇచ్చి న్యాయం పక్షాన నిలిచిందని బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఖమ్మం జిల్లా దీనిని స్వాగతిస్తుందని, లిక్కర్ పాలసీ కేసు అక్రమంగా పెట్టిన కేసు అని, ఇందులో ఎలాంటి నిజాలు లేవని మొదట్నుంచీ చెబుతూ వచ్చామన్నారు. కవితకు బెయిల్ మంజూరుపై కాంగ్రెస్, బీజేపీ నేతలు మతిభ్రమించి మాట్లాడుతున్నారని, బీఆర్ఎస్‌కు వస్తున్న ప్రజాదరణను జీర్ణించుకోలేకే ఆయా పార్టీల నేతలు తలా తోకా లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. సుప్రీం కోర్టు ఆదేశాలను తప్పుబట్టేలా మాట్లాడుతున్న నేతలది కోర్టు ధిక్కారణ నేరం కిందకే వస్తుందని, ఇప్పటికైనా కాంగ్రెస్, బీజేపీ నేతలు పిచ్చి ప్రేలాపనలు మానుకోవాలని తాతా మధు హెచ్చరించారు.



బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు

## ఎమ్మెల్సీ కవితపై ఈడీ కేసు అక్రమం

### ఎంపీ వద్దిరాజు రవిచంద్ర



ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

ఖమ్మం, ఆగస్టు 27 : ఢిల్లీ లిక్కర్ పాలసీతో ఏ మాత్రం సంబంధం లేకున్నా తమ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితపై ఈడీ అక్రమంగా కేసు బనాయించి 168 రోజులు అన్యాయంగా జైల్లో వేయించడం తీవ్ర బాధాకరమని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. కవితకు బెయిల్ మంజూరైన సందర్భంగా మంగళవారం ఎంపీ వద్దిరాజు సుప్రీంకోర్టు వద్ద మీడియాతో మాట్లాడారు. సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో బెయిల్ మంజూరు చేసి ఊరట కల్పించడం సంతోషకరమన్నారు. లిక్కర్ పాలసీతో ఆమెకు ఎటువంటి ప్రమేయం లేదని, ఇందుకు సంబంధించి ఆమె వద్ద నుంచి ఎలాంటి పత్రాలు, ఆధారాలు లభించలేదన్నారు. కేసులో దమ్ములేదని అన్యాయంగా, అక్రమంగా బనాయించారని అన్నారు. ప్రజాప్రతినిధిగా ఉన్న కవితను సామాన్య ఖైదీల మాదిరిగా చూడడం పట్ల న్యాయస్థానం కూడా తప్పుబట్టిందన్నారు. ఈ కేసులో కవిత కడిగిన ముత్యం మాదిరిగా బయటకు వస్తారని ఆయన స్పష్టం చేశారు. కవితకు బెయిల్ మంజూరు కావడం పట్ల తెలంగాణ ప్రజలు, మహిళామణులు, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇందుకు సహకరించిన న్యాయవాదులు, ప్రెస్ అండ్ మీడియా, పార్టీ ప్రముఖులకు ఎంపీ వద్దిరాజు ధన్యవాదాలు తెలిపారు.

## కడిగిన ముత్యంలా వచ్చిన కవిత

### జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్



ఇల్లెందులో బీఆర్ఎస్ శ్రేణులతో కలిసి నినాదాలు చేస్తున్న దిండిగాల రాజేందర్

ఇల్లెందు రూరల్, ఆగస్టు 27 : పార్లమెంట్ ఎన్నికల సమయంలో ఎమ్మెల్సీ కవితపై అక్రమంగా కేసులు పెట్టారని, రాజకీయ కుట్రతో జైలుకు పంపినా కడిగిన ముత్యంలా బయటకు వచ్చారని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ దిండిగాల రాజేందర్ అన్నారు. సుప్రీం కోర్టు కవితకు బెయిల్ మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం జగదాంబ సెంటర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహ వద్ద టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు మిలాఖత్ అయి.. ప్రతిపక్ష నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపేందుకు కుట్రలు పన్నుతున్నాయన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతిపక్ష నాయకులపై కేసులు పెడితే ఉద్యమాలు చేసేందుకు వెనుకాడబోమన్నారు. కార్యక్రమంలో ఉద్యమ నాయకులు సిలివేరి సత్యనారాయణ, దేవీలాల్‌నాయక్, భావ్‌సింగ్, జిల్లా నాయకులు ఎస్.రంగనాథ్, కౌన్సిలర్లు జేకే శ్రీను, సందా ప్రవీణ్, తోట లలిత, శారద, పద్మ, కోఆప్షన్ సభ్యుడు ఘాజీ, శీలం రమేశ్, అబ్దుల్ నభి, జబ్బార్, గిన్నారపు రాజేశ్, భూక్యా సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కవిత కేసులో న్యాయమే గెలిచింది

### కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి



కొత్తగూడెంలో సంబురాల్లో పాల్గొన్న బీఆర్ఎస్ శ్రేణులు

కొత్తగూడెం అర్బన్, ఆగస్టు 27 : ఎమ్మెల్సీ కవితపై బనాయించిన అక్రమ కేసులో న్యాయమే గెలిచిందని, సుప్రీం కోర్టు సరైన తీర్పు ఇచ్చిందని కొత్తగూడెం మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి అన్నారు. ఎమ్మెల్సీ కవితకు బెయిల్ మంజూరు కావడంతో కొత్తగూడెం పట్టణంలో మంగళవారం బీఆర్ఎస్ శ్రేణులు చైర్‌పర్సన్ ఆధ్వర్యంలో బాణసంచా కాల్చి.. స్వీట్లు పంచుకొని సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుమ్మక్కై కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని, ఇందుకు నిదర్శనమే కవిత అరెస్ట్ అని అన్నారు. కేసీఆర్‌ను, బీఆర్ఎస్ పార్టీని అబాసుపాలు చేసేందుకే ఇన్ని కుట్రలు పన్నారన్నారు. ఏ పార్టీతో లాలూచీ పడాల్సిన అవసరం కేసీఆర్‌కు లేదన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు అంబుల వేణుగోపాల్, ప్రసాద్‌బాబు, బీఆర్ఎస్ నేతలు తొగరు రాజశేఖర్, సంకుబాపన అనుదీప్ తదితరులు పాల్గొన్నారు.

# మాఫీకి సంతకం కొర్రీ

- ధ్రువీకరణపై కార్యదర్శి సంతకాల కోసం రైతుల పరుగులు
- రుణమాఫీ వర్తించాలంటే సంతకం తప్పనిసరి కావాల్సిందే..
- దీనిపై మాకు ఆదేశాలు రాలేదంటున్న కార్యదర్శులు
- అయోమయానికి గురవుతున్న ఏజెన్సీ రైతులు

దుమ్ముగూడెం, ఆగస్టు 27 : ప్రభుత్వం రుణమాఫీ చేసినట్లుగా ప్రకటించినా అధికారుల మధ్య సమన్వయ లోపం వల్ల అన్నదాతలు అసహనానికి గురవుతున్నారు. సాక్షాత్తు సీఎం రేవంత్‌రెడ్డి రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పినా.. ఏజెన్సీ మండలమైన దుమ్ముగూడెం మండలంలో చాలా మంది రైతులకు మాఫీ వర్తించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. మూడు విడతల్లో భాగంగా.. మొదటి విడతలో 2,200, రెండో విడతలో 1,170, మూడో విడతలో 750 మంది రైతులకు మాత్రమే మాఫీ వర్తించింది. దీంతో మిగిలిన రైతులకు రుణమాఫీ వర్తించకపోవడంతో వారంతా వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ విసిగిపోతున్నారు. అయితే రుణమాఫీ వర్తించని రైతుల నుంచి తాజాగా ధ్రువీకరణ పత్రాలు తీసుకుంటూ అనేక కొర్రీలు, షరతులు, మెలికలు పెడుతున్నారని మండిపడుతున్నారు.



ధ్రువీకరణ పత్రం

| క్రమ సంఖ్య | పేరు | ఆధార్ నెంబర్ | వయస్సు | సంబంధం |
|---|---|---|---|---|
| | | | | |

వ్యవసాయ శాఖ అధికారులు సూచించిన ధ్రువీకరణ పత్రం

### ధ్రువీకరణ పత్రం పూర్తి చేయాల్సిందే..

ధ్రువీకరణ పత్రంలో రైతు కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ నెంబర్, వయస్సు, కుటుంబానికి ఉన్న బంధం తదితర అంశాలను పూర్తి చేయిస్తున్నారు. రుణమాఫీ కోసం దరఖాస్తు తీసుకున్న రైతు ఏ పరిధిలో ఉంటే అక్కడి పంచాయతీ కార్యదర్శి సంతకం చేయించి వ్యవసాయాధికారులకు అందించాలనేది ధ్రువీకరణ పత్రం సారాంశం. అంతేకాక అర్హులు కారని నిర్ధారణ అయితే రుణమాఫీని తిరిగి ప్రభుత్వానికి చెల్లించడానికి అంగీకరిస్తున్నట్లు కూడా అందులో పొందుపర్చడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు.

### రైతులతో మండల పరిషత్ కిటకిట

వ్యవసాయాధికారుల సూచన మేరకు మంగళవారం ధ్రువీకరణ పత్రాలను నింపుకుని రైతులందరూ మండల పరిషత్ కార్యాలయానికి కార్యదర్శుల సంతకాల కోసం చేరుకోవడంతో కిటకిటలాడుతూ కనిపించింది. సంతకం కోసం రైతులు కార్యదర్శులను సంప్రదిస్తే.. మాకు ఆదేశాలు ఏమీ లేవని కార్యదర్శులు చెప్పడం కొసమెరుపు. ఇదిలా ఉండగా.. దీనిపై 'నమస్తే తెలంగాణ' వ్యవసాయాధికారి నవీన్‌కుమార్‌ను వివరణ కోరగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధ్రువీకరణ పత్రంలో కార్యదర్శి సంతకాలు తీసుకోవాలని చెప్పామన్నారు. ఇదే విషయమై ఎంపీవో పి.రామకృష్ణను వివరణ కోరగా.. కార్యదర్శులకు అలాంటి ఆదేశాలు ఇవ్వాలని మాకు చెప్పలేదని తెలిపారు. దీంతో అధికారుల డొల్లతనం బయట పడినట్లు తెలుస్తోంది.

### రుణమాఫీకి ఇన్ని అడ్డంకులా..



గత కేసీఆర్ ప్రభుత్వంలో రుణమాఫీ విషయంలో ఏనాడూ ఇన్ని ఇబ్బందులు పడలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక తాజాగా చేసిన రూ.2 లక్షల రుణమాఫీ వర్తించాలంటే అధికారులు అడ్డంకులు సృష్టించారు. జాబితాలో నా పేరు రాకపోవడంతో వ్యవసాయాధికారులు, బ్యాంకు అధికారులను సంప్రదించగా.. మాకు తెలియదని సమాధానం దాటవేశారు. నిబంధనలు అన్నదాతలను అయోమయానికి గురిచేస్తున్నాయి.

**– గుగులోతు కృష్ణ, రైతు, సుజ్ఞానపురం, దుమ్ముగూడెం మండలం**

### కార్యదర్శి దురుసుగా సమాధానం..



మూడు విడతల్లో చేసిన రుణమాఫీ ప్రకటనలో నా పేరు రాలేదు. తాజాగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పడంతో వ్యవసాయ శాఖ నుంచి దరఖాస్తు తీసుకొని పూర్తి చేశా. సంతకం కోసం మండల పరిషత్ కార్యాలయానికి వెళితే కార్యదర్శి కనిపించలేదు. ఫోన్ చేసి ఎక్కడున్నారని అడిగితే.. ఫీల్డ్‌లో ఉన్నా అని చెప్పారు. ఆయన వచ్చిన తర్వాత రుణమాఫీకి సంతకం కావాలని అడిగితే.. సంతకం పెట్టాలని మాకు ఎవరూ చెప్పలేదని అన్నారు. ధ్రువీకరణ పత్రంపై నేను సంతకం పెట్టనంటూ దురుసుగా సమాధానం ఇచ్చారు.

**– పిట్టా పూర్ణచందర్‌రావు, రైతు, చిన్నబండిరేవు**

# గుడిసెల తొలగింపు యత్నం ఉద్రిక్తం

- అవి పట్టా భూములంటూ తొలగించేందుకు వచ్చిన పోలీసులు
- రేకుల షెడ్ల కూల్చివేతలను అడ్డుకున్న నిరుపేదలు
- రౌడీమూకలను రంగంలోకి దించిన భూ యజమానులు
- మద్యం మత్తులో భయభ్రాంతులకు గురిచేసిన మూకలు
- పోలీసుల ప్రేక్షక పాత్రపై మండిపడిన నిరుపేదలు



యంత్రాల సహాయంతో పోలీసులు తొలగిస్తున్న అక్రమ నిర్మాణాల తొలగింపును అడ్డుకుంటున్న నిరుపేదలు

రఘునాథపాలెం, ఆగస్టు 27 : ఖమ్మం అర్బన్ పరిధిలోని వెలుగుమట్ల ప్రాంతంలో పేదలు వేసుకున్న రేకుల షెడ్లు, గుడిసెలను పోలీసులు మంగళవారం జేసీబీలతో తొలగించేందుకు యత్నించగా పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. రెవెన్యూ సర్వే నెంబర్ 148, 149లో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్లను తొలగించేందుకు పోలీసులు జేసీబీలతో రంగప్రవేశం చేశారు. దీంతో విషయం తెలుసుకున్న పేదలు షెడ్ల కూల్చివేత యత్నాన్ని అడ్డుకున్నారు. జేసీబీలకు అడ్డంగా నిల్చొని కూల్చివేతలను నిలువరించారు. ఏసీపీ రమణమూర్తి, పలువురు సీఐలు మైక్ ద్వారా ఎంతగా వారించి.. హెచ్చరికలు జారీ చేసినా ఏమాత్రం తగ్గలేదు. ముందస్తు సమాచారం, నోటీసులు ఇవ్వకుండా ఎలా కూల్చివేస్తారని నిరుపేదలు నిలదీశారు. పట్టా భూములను ఆక్రమించి షెడ్లు నిర్మించడం సరికాదని, మీతో షెడ్లు వేయించిన నాయకులకు రెండు నెలలుగా తొలగించాలని చెప్పిన విషయాన్ని ఏసీపీ రమణమూర్తి మైక్ ద్వారా పేదల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో స్పందించిన పేదలు తమకు రెండు రోజుల గడువు కావాలని, స్వచ్ఛందంగా షెడ్లను తొలగిస్తామని ఏసీపీని వేడుకున్నారు. దీనికి నిరాకరించిన పోలీసులు మరోమారు యంత్రాలతో రేకుల షెడ్లను కూల్చివేసేందుకు ప్రయత్నించి విఫలమయ్యారు.

### ప్రేక్షక పాత్ర పోషించిన పోలీసులు

కాగా.. షెడ్ల తొలగింపులో పోలీసుల ప్రయత్నం విఫలం కావడంతో పట్టా భూమి యజమానులు వంద మందికి పైగా రౌడీమూకలను రంగంలోకి దించారు. ఒక్కసారిగా రేకుల షెడ్ల ప్రాంతం వద్ద ప్రత్యక్షమైన అల్లరి మూకలు మద్యం మత్తులో అక్కడున్న పేదలు భయభ్రాంతులకు గురయ్యేలా హడావుడి చేశారు. షెడ్లను ఇష్టారీతిగా తన్నుతూ.. పిడిగుద్దులు గుద్దుతూ పెద్ద ఎత్తున శబ్దాలు చేస్తూ తొలగింపు చర్యలు చేపట్టారు. అయినా తమ షెడ్లను కాపాడుకునేందుకు రౌడీమూకలను అడ్డుకునే ప్రయత్నం చేసినా వారు ఆపలేదు. ఇదంతా పోలీసుల కళ్లముందే జరుగుతున్నా వారు ప్రేక్షక పాత్ర పోషించారు. ఒకపక్క వారిని అడ్డుకున్నట్లు ప్రయత్నిస్తూనే.. మీ పని మీరు చేయండి అంటూ సైగలు చేయడం కనిపించింది. దీంతో పోలీసుల నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో రౌడీమూకల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. అడ్డుకోబోయిన మహిళలను అసభ్య పదజాలంతో దూషిస్తూ షెడ్లను తొలగించడం కనిపించింది.

### మోసపోయామంటూ రోదించిన నిరుపేదలు

భూదాన్ భూమి పేరుతో తమ వద్ద కొందరు వ్యక్తులు డబ్బులు తీసుకొని రేకుల షెడ్లు వేయించారని బాధితులు ఆరోపించారు. పది మంది నాయకులుగా చలామణి అవుతూ తమ వద్ద రూ.50 వేల నుంచి రూ.3 లక్షల వరకు డబ్బులు తీసుకొని తమతో దగ్గరుండి మరీ 100 గజాల చొప్పున జాగా చూపించి షెడ్లు వేయించారని వాపోయారు. తీరా మాతో వేయించిన భూమి పట్టా అని తేలడంతో మోసపోయామని గుండెలు బాదుకుంటూ నిరుపేదలు రోదిస్తుండడం కనిపించింది.

# జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడిగా పెసర ప్రభాకర్‌రెడ్డి



పెసర ప్రభాకర్‌రెడ్డి

ఖమ్మం ఎడ్యుకేషన్, ఆగస్టు 27 : జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఖమ్మంజిల్లాకు చెందిన పెసర ప్రభాకర్‌రెడ్డి ఎంపికయ్యాడు. తెలంగాణ రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపిక కాగా రాజన్నసిరిసిల్ల జిల్లా నుంచి ఒకరు, ఖమ్మం జిల్లా నుంచి జడ్పీఎస్ఎస్ తిరుమలాయపాలెంలో బయోలాజికల్ సైన్స్ టీచర్‌గా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డి ఎంపికయ్యారు. ప్రభాకర్‌రెడ్డి పూర్వ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని బయ్యారం మండలం ఇర్సులాపురం గ్రామంలోని రైతు కుటుంబమైన పిచ్చిరెడ్డి–శిరేఖ దంపతులకు నాలుగో సంతానంగా జన్మించారు. 10వ తరగతి, ఇంటర్ వరకు బయ్యారంలో, డిగ్రీ ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్‌లో పూర్తి చేశారు. 1996లో ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు.

### 28 సంవత్సరాల అనుభవం..

ఉద్యోగం ప్రారంభించిన నాటి నుంచి ఎక్కువ కాలం ఏజెన్సీ ప్రాంత పరిధిలోని పాఠశాలల్లో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించారు. టీచర్‌గా సుమారు 28 సంవత్సరాల అనుభవం ఉంది. వీటితోపాటు జాతీయ, రాష్ట్ర సెమినార్లు, వెబినార్లలో పాల్గొనడం, పాఠ్యపుస్తక రచయితగా, డిజిటల్ కంటెంట్ క్రియేటర్‌గా కృషిచేశారు. 2008లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2016లో ఎన్ఎఫ్‌టీడబ్ల్యూ(జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ సంక్షేమ సంస్థ) ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2018లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, 2024 ఇప్పుడు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోనున్నారు.